క్లుప్తంగా

ఎర్రనల్లి నివారణపై దృష్టి సారించాలి

రాయికోడ్(అందోల్): పత్తి పంటకు సోకుతున్న ఎర్రనల్లి నివారణపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి సారిక రైతులకు సూచించారు. వ్యవసాయ కార్యాలయంలో ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి కాత, పూత దశలో ఉందని పంటకు ఎర్రనల్లి తెగులు బెడద ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎర్రనల్లి నివారణకు ఎకరం పత్తికి 400 గ్రాముల థయోమిథాక్సిమ్ రసాయనం నీటిలో కలిపి స్ప్రే చేయాలని సూచించారు. మొక్కల పెరుగుదలకు ఎకరాకు 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువును చల్లుకోవాలన్నారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగించొద్దన్నారు. పంటల సాగులో తమ సూచనలు పాటించి పెట్టుబడులు తగ్గించుకొని ఆశించిన దిగుబడి పొందాలని సూచించారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఆగిపోయిన చదువు తిరిగి కొనసాగించుకోవాలనుకునే వారికి ఓపెన్ స్కూల్ ఓ వరమని మండల విద్యాధికారి శంకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆత్మకూర్ ప్రభుత్వ పాఠశాలలో గల ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్‌ను అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ సందీప్‌కుమార్ సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు కొనసాగుతున్నాయన్నారు. సెప్టెంబర్ 10వరకు ప్రవేశం పొందాలన్నారు. చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులు వారి విద్యార్హతలు పెంపొందించుకునేందుకు ఓపెన్ స్కూల్, దూరవిద్య ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


ప్రసాద్

సంగారెడ్డిటౌన్: యువకుడు అదృశ్యమైన ఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ప్రసాద్(20) అదృశ్యమయ్యాడు. తండ్రి మాణయ్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ క్లీనిక్‌లో ప్రసాద్ వార్డ్ బాయ్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్క వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆచూకీ లభించినట్లయితే 87126 56718 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

నాగల్‌గిద్ద ఏఓగా ప్రవీణ్‌చారి

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండల వ్యవసాయ అధికారిగా ప్రవీణ్‌చారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కంగ్టి మండలం నుంచి ఆయన బదిలీపై నాగల్‌గిద్దకు వచ్చారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన నాగల్‌గిద్దకు వచ్చారు. ఇక్కడ ఏవోగా పనిచేసిన వెంకటేశం ఖేడ్‌కు బదిలీపై వెళ్లారు.

పాత పంచాయతీలోనే తండాను కొనసాగించాలి

నారాయణఖేడ్: మండలంలోని శివార్‌సందు తండాను పాత కొండాపూర్ పంచాయతీలోనే కొనసాగించాలని ఆ తండావాసులు మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబాకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం కొండాపూర్ పంచాయతీ పరిధిలో హనుమాన్ మందిర్ తండా, మిత్యానాయక్‌తండా, శివార్‌సందు తండా, స్కూల్‌తండాలు ఉన్నాయని తెలిపారు. కొత్తగా హనుమాన్ మందిర్ తండాను పంచాయతీగా ఏర్పాటు చేస్తూ శివార్‌సందు తండాను అందులో చేరుస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదలైందని తెలిపారు. దీంతో తమకు అసౌకర్యంగా ఉండే అవకాశం ఉన్నందున కొండాపూర్ పంచాయతీ పరిధిలోనే తమ తండాను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధ్యాయులు చేసిన సేవలతో సమాజంలో గుర్తింపు పొందుతారని హెచ్ఎం రహీమొద్దీన్ తెలిపారు. మంగళవారం మండలంలోని తడ్కల్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు తట్టి సావిత్రి, గంగమని పాల్గొన్నారు.

నేటి నుంచి ఫీవర్ సర్వే

సంగారెడ్డి: మున్సిపాలిటీలో బుధవారం నుంచి ఈ నెల 30వ తేదీవరకు ఫీవర్ సర్వే నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ సిబ్బంది, ఏఎన్ఎంలు ఇంటింటికీ వచ్చి సర్వే చేస్తారని, ఇంటికి వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. అదేవిధంగా అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు.

ప్రయాణికుల పాట్లు


దౌల్తాబాద్ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

రాఖీ పౌర్ణమి సందర్భంగా వివిధ గ్రామాలకు వెళ్లే మహిళలు బస్సులు సరిపడా లేకపోవడంతో దౌల్తాబాద్ బస్టాండ్‌లో మంగళవారం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సమయానికి బస్సులు రాకపోవడంతో వచ్చిన బస్సుల్లో ప్రయాణికులు అధికంగా ఉండడంతో మహిళలు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. రాఖీల కట్టేందుకు వెళ్తున్న మహిళలకు ఇబ్బందులు తప్పలేదు.

– హత్నూర(సంగారెడ్డి):

వ్యర్థాలతో అవస్థలు

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో మార్కెట్ (సంత) జరిగి మూడురోజులవుతున్నా మున్సిపల్ సిబ్బంది వ్యర్థాలను తొలగించడలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పట్టణంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి చెత్త నుంచి దుర్వాసన వస్తోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. చెత్త కుళ్లిపోవడంతో దోమల బెడద కూడా పెరుగుతోందని, అధికారులు వెంటనే చెత్తను తొలగించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

– సంగారెడ్డి అర్బన్:


కలెక్టరేట్ ఆవరణలో పడి ఉన్న చెత్త

ప్రభుత్వ ఉద్యోగులకు రుణమాఫీ చేయాలి

జోగిపేట(అందోల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకంలో ప్రభుత్వ ఉద్యోగులను చేర్చకపోవడం సరికాదని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నాసర్ పటేల్ అన్నారు. మంగళవారం జోగిపేటలో ఒక ప్రకటనను విడుదల చేస్తూ పట్టాపాస్ పుస్తకం ఉన్న ప్రతీ ఒక్క రైతుకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రుణమాఫీ చేసిన వెంటనే బ్యాంకుకు వెళ్లి రుణాలు పొందాలని ప్రకటించిన సీఎం ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఐటీ కట్టేవారు అనర్హులుగా భావించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో ఉద్యోగులు కీలకంగా వ్యవహరించారన్నారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగులందరికీ రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


పటాన్‌చెరు టౌన్: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


హత్నూర (సంగారెడ్డి): దౌల్తాబాద్‌లో..

రాజీవ్ సేవలు చిరస్మరణీయం

జిల్లా వ్యాప్తంగా దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని మంగళవారం అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టెక్నాలజీ రంగంలో రాజీవ్‌గాంధీ సేవలు మరిచిపోలేనివని కొనియాడారు. బడుగు బలహీన ప్రజల అభివృద్ధి కోసం ఆయన ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ఆశయ సాధనకు కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు సూచించారు.


జహీరాబాద్‌లో..


పటాన్‌చెరుటౌన్: కేక్ కట్ చేస్తున్న నాయకులు


జోగిపేట(అందోల్): జోగిపేటలో..

భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

జోగిపేట(అందోల్): మాలమహానాడు జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈ నెల 21వ తేదీ బుధవారం చేపట్టనున్న భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని అందోలు మండల మాల మహానాడు కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. మంగళవారం జోగిపేటలో మండల స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. వర్గీకరణ హేతుబద్ధమైన అనైతిక చర్య అని, మందకృష్ణమాదిగ తన రాజకీయ స్వలాభం కోసం బీజేపీకి తాకట్టుపెట్టాడని మాల మహానాడు నాయకులు తీవ్రంగా విమర్శించారు. దళితులమంతా ఐకమత్యంగా ఉంటూ రాజ్యాధికారం వైపు పయనిద్దామని నాయకులు కోరారు.


మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

సమావేశంలో మాలమహానాడు మండల కమిటీ నాయకులు ప్రసాద్, మహేశ్, పరిపూర్ణ, గోపాల్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

జహీరాబాద్‌టౌన్: పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆయన వరదలతో నీట మునిగే కాలనీ ప్రాంతాలను తిరిగి చూశారు. బైపాస్ రోడ్డు ప్రాంతాల్లోని మేజర్ వరద కాల్వలను పరిశీలించారు. భారీ వర్షాలకు డ్రీమ్ ఇండియా, వసంత్ విహార్ తదితర కాలనీలు నీటమునిగే అవకాశాలు ఉన్నాయని, వరద కాల్వలకు అడ్డంగా ఎలాంటి కట్టడాలు చేపట్టొద్దన్నారు. భారీ వర్షాలతో కాలనీల్లోకి నీరువస్తే మున్సిపల్ కార్యాలయంలో సమాచారం


బైపాస్ రోడ్డు ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

ఇవ్వాలని ప్రజలను కోరారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సూచనల మేరకు రేపటి నుంచి ప్రతిరోజు సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ఎవరికైనా వ్యాధులు ఉంటే సర్వే సిబ్బందికి తెలపాలని, ఇందుకు అనుగుణంగా వైద్యం అందిస్తామన్నారు. ఇంటి పరిసరాలు, కాలనీల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ రక్షిత మంచినీరు మాత్రమే తీసుకోవాలని, జ్వరం వస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, ఆర్ఓ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ రాధిక, కుశీక్, 23వ వార్డ్ కౌన్సిలర్ జహంగీర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పటాన్‌చెరుటౌన్: అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలు, మున్సిపల్ పరిధిలో వివిధ కాలనీలకు చెందిన 57 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా మంజూరైన 57 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఆయన మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో అరులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహాగౌడ్, తహసీల్దార్ రాధా, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తాపడి ఇద్దరికి గాయాలు

జహీరాబాద్‌టౌన్: మండలంలోని రాయిపల్లి(డి) గ్రామ శివారులో జాతీయ రహదారిపై కారు బోల్తాపడి ఇద్దరికి గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వైపు వస్తున్న కారు మంగళవారం రాత్రి రాయిపల్లి(డి) శివారులో డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఝరాసంఘం మండలం ఎడాకుపల్లి గ్రామానికి చెందిన వారీగా గుర్తించారు. గాయపడిన భార్యాభర్తలను జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

కంగ్టి(నారాయణఖేడ్): ఫర్టిలైజర్ దుకాణాల్లో సరిపోయేంత ఎరువులు సిద్ధంగా ఉంచాలని ఏడీఏ నూతన్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కంగ్టిలో ఫర్టిలైజర్ షాపులను ఆయన తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్, రికార్డులు పరిశీలించారు. దుకాణాల్లో స్టాక్ బోర్డు, ధరల పట్టికలు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం బాబుల్‌గాం, ముర్కుంజల్‌లో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీకాంత్ ఉన్నారు.


ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏడీఏ నూతన్‌కుమార్

సీఎంకు రాఖీకట్టిన కార్పొరేటర్


సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సీఎం రేవంత్‌రెడ్డిని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేశ్ మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు రాఖీకట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

కులబ్‌గూర్ పంచాయతీ కార్యదర్శిగా శారద

సంగారెడ్డిటౌన్: మండలంలోని కులబ్‌గూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా మంగళవారం శారద బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన కార్యదర్శి బదిలీపై పసల్వాది వెళ్లారు. ఈ సందర్భంగా ఆమెకు గ్రామ మాజీ పాలకవర్గ సభ్యులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ఆమె పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం శారద మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. వీధిలైట్లు, మంచి నీటి విడుదల, పారిశుధ్యం తదితర అంశాల స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు.

సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

కొండాపూర్(సంగారెడ్డి): ఇటీవల సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గిరిధర్‌రెడ్డిని మంగళవారం మల్కాపూర్ శివారులో కాంగ్రెస్ నాయకుడు, ఎన్ఆర్ఐ పట్లోళ్ల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ పట్లోళ్ల మనోజ్‌రెడ్డితో పాటు కార్యకర్తలు గజమాలతో పాటు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువకులకు అనేక అంశాలపై శిక్షణ ఇస్తూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గురురాజ్, బల్వంత్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీ సమస్యలపై దరఖాస్తులు


న్యాల్‌కల్(జహీరాబాద్): రైతులతో మాట్లాడుతున్న ఏఓ అభినాశ్‌వర్మ

ఝరాసంగం(జహీరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతీష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్ సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు వివిధ గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఈఓలు సుకుమార్, జ్ఞానం, శివప్రియ, రేణుక, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బారులు తీరిన రైతులు

మునిపల్లి(అందోల్): ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంతో డబ్బులు తీసుకోవడానికి బ్యాంకులలో బారులు తీరారు. మంగళవారం మండలంలోని మునిపల్లి, బుదేరా, కంకోల్‌లోని ఆయా బ్యాంకులలో మొదటి, రెండో, మూడో విడత రుణమాఫీ అయిన రైతులు డబ్బులు తీసుకోవడానికి క్యూ కట్టారు. అంతేకాకుండా వరుసగా రెండు రోజులు బ్యాంకులకు సెలవు రావడంతో రైతులంతా ఒకేసారి రుణమాఫీ డబ్బుల కోసం బారులు తీరారు. అంతేకాకుండా రెండు లక్షలకుపైగా రుణాలు ఉన్న రైతులు రినీవల్ చేసుకోవడానికి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

688 మంది రైతుల రుణాలు మాఫీ

రాయికోడ్(అందోల్): మండలంలోని నల్లంపల్లి, ఇందూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా పంట రుణాలు పొందిన 688 మంది రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసినట్లు రాయికోడ్ డీసీసీబీ మేనేజర్ మమత తెలిపారు. ఆయా సంఘాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన 2018 నుంచి 2023 కటాఫ్ తేదీల మధ్య 1,496 మంది పంట రుణాలు తీసుకున్నారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మూడు విడతల రుణమాఫీలో 688 మంది రైతులకు చెందిన సుమారు రూ.5.34 కోట్ల పంట రుణమాఫీ అయ్యాయన్నారు. మాఫీ అయిన రైతులకు తిరిగి పంటరుణాలు అందిస్తున్నామన్నారు.

దరఖాస్తుల వెల్లువ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ముంగిలో రైతువేదిక అధికారులు, రైతులతో కిటకిటలాడింది. రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని వ్యవసాయశాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో మండల వ్యవసాయశాఖ అధికారి అభినాశ్‌వర్మ, ఏఈఓలు సాయిలు, షరీఫ్, సాయికిరణ్‌రెడ్డి, మాధవి తదితరులు ముంగిలోని రైతువేదికల్లో రైతుల నుంచి సుమారు 300 దరఖాస్తులు స్వీకరించారు. రుణమాఫీ కాని రైతులు పట్టాపాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ స్టేట్‌మెంట్ తదితర పత్రాలతో రైతువేదికకు వచ్చి వాటిని అధికారులకు అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలిరావడంతో రైతువేదిక రైతులతో కిటకిటలాడింది. రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించే కార్యక్రమం కొనసాగుతుందని ఏఓ అభినాశ్‌వర్మ తెలిపారు.

దోమలను నివారిద్దాం.. డెంగీని అరికడదాం

రాంసానిపల్లిలో కళాబృందాల ప్రదర్శన

వటపల్లి(అందోల్): సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పర్యవేక్షణలో 'తెలంగాణ సాంస్కృతిక సారథి' సంగారెడ్డి జిల్లా కళాబృందం మండలంలోని రాంసానిపల్లి గ్రామంలో కళాప్రదర్శన నిర్వహించారు. గ్రామాల్లో విస్తరిస్తున్న డెంగీ జ్వరంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వివరిస్తూ రాంసానిపల్లి గ్రామంలో కళాజాత నిర్వహించారు. ఇంటి చుట్టుపక్క పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. తాగునీరు వేడిచేసుకొని చల్లార్చి తాగాలని, ఎక్కువ రోజులు నిల్వ చేసిన నీటిని తాగకూడదని అవగాహన కల్పించారు. కళాకారుల ఆటాపాటలు గ్రామస్తులను అలరించాయి. ప్రజలు చెత్తను బయట వేయకుండా పంచాయతీ చెత్త సేకరణ వాహనాల్లో మాత్రమే వేసేలా ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించారు. కార్యక్రమంలో కళాకారులు ఆయిదాల సునీల్, రమేశ్, నవీన్, శంకర్ పాల్గొని కళాప్రదర్శన నిర్వహించారు.


ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

మేతకు వెళ్లి.. గేదెలు మృతి

పటాన్‌చెరుటౌన్: మేతకు వెళ్లిన రెండు గేదెలు మృత్యువాతపడిన సంఘటన జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలోని కిష్టయ్యపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మంగళవారం బసెట్టిగారి సాయికి చెందిన రెండు గేదెలు మేతకు వెళ్లి మృత్యువాత పడ్డాయి. దీంతో గ్రామస్తులు అయ్యమ్మ చెరువు కట్టపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షపు నీటితో వ్యర్థజలాలను విడుదల చేస్తున్న పరిశ్రమలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణపై పీసీబీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.